క్లుప్తంగా

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

దాచేపల్లి: నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు కమిషనర్ వైవీ అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాచేపల్లిలోని సచివాలయం-1లో నిర్వహించనున్న సమావేశానికి నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షత వహించనున్నారు. కౌన్సిలర్లు, కో ఆపన్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నాలని ఆయన కోరారు.

దర్శకేంద్రుడు దాసరికి నివాళి

వినుకొండ: దర్శకేంద్రుడు దాసరి నారాయణ రావు వర్ధంతి సందర్భంగా గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర స్టూడియోలో దాసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్షుడు గుమ్మడి మాట్లాడుతూ దాసరి దర్శకత్వం వహించిన సినిమాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. సమాజాన్ని మేల్కొలిపే చిత్రాలు అనేకం తీశారన్నారు. కార్యక్రమంలో భీమవరం ఏడుకొండలు, మందేపల్లి లక్ష్మీనరసయ్య, ఎం. వెంకటేశ్వర్లు, దాసరి నాగేశ్వరరావు, ముదికోటి మహేశ్వరరావు, రావిపాటి వీరయ్య, బొంకూరి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

5న లూథరన్ దేవాలయ పునః ప్రతిష్ట

నాదెండ్ల: స్థానిక చైతన్యనగర్ కాలనీ (పెద్ద ఎస్సీ కాలనీ)లో సుమారు రూ.1.50 కోట్లలో పునర్నిర్మించిన ఎసిఫానియా లూథరన్ దేవాలయం జూన్ 5వ తేదీన ప్రతిష్ట మహోత్సవం నిర్వహించనున్నట్లు చర్చి ఫాదర్ బి.మోహనరావు తెలిపారు. 1955లో నిర్మించిన చర్చి శిథిలావస్థకు చేరటంతో గ్రామస్తు లు, దాతల సహకారంతో 2020 మే నెలలో పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. సుమారు రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తి చేశామన్నారు. జూన్ 5వ తేదీ ఉదయం 10 గంటలకు పునః ప్రతిష్ట కార్యక్రమం జరగనుంది. 4న మందసం ఊరేగింపు, 5 ఉదయం ప్రతిష్ట, సాయంత్రం కోలాట ప్రదర్శన జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ఏఈఎల్‌సీ కంట్రోలర్, మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కురియన్‌జోసఫ్, ఏఈఎల్‌సీ అడ్మినిస్ట్రేటర్ జోసఫ్, సెక్రటరీ జేసు రత్నకుమార్, జీఎస్టీ రిటైర్డ్ సూపరింటెండెంట్ బి.రాజేశ్వరరావు, విశ్రాంత డీఎస్‌పో జాన్‌వెస్లీ, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ మంత్రి విడదల రజిని, అధికారులు, నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ప్రజాప్రతినిధులను గౌరవించడం లేదు...

- కూటమి నాయకుల ప్రాధాన్యంపై ఆగ్రహం
- సర్పంచుల ప్రమేయం లేకుండానే నిధులు డ్రా
- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆవేదన


సమావేశంలో అధికారులతో ప్రజాప్రతినిధుల వాగ్వాదం

దాచేపల్లి: ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను అధికారులు ఏ మాత్రం గౌరవించటం లేదని.. ప్రజాప్రతినిధుల కనీస సమాచారం ఇవ్వకుండా అవమానిస్తున్నారు.. ఎన్నికల్లో పోటీచేసి గెలిచిన మా కంటే అధికారంలో ఉన్న కూటమి నాయకులతో అధికారులు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. దాచేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కందుల జాను అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులతో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై సమావేశంలో ఏకరువు పెట్టారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని, ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని, గ్రామాల్లో పనులు చేసి ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటే అడుగడుగున అధికారులు అటంకాలు సృష్టిస్తున్నారని ఫిర్యాదు చేశారు. కొన్ని గ్రామాల్లో సర్పంచుల ప్రమేయం లేకుండానే పంచాయతీ కార్యదర్శులు పంచాయతీ నిధులు డ్రా చేస్తున్నారని, కావాలనే వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లకు చెక్‌పవర్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ప్రజాప్రతినిధులు చెప్పారు. ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వ అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఇబ్బందికరంగా ఉందని, ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాలని వారు కోరారు. ఎంపీపీ కందుల జాను మాట్లాడుతూ. .ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా ఉంటేనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతాయని, ప్రజాప్రతినిధులను కలుపుకుని అధికారులు పని చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మధ్య విబేధాలతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని, సమన్వయంతో పనిచేయాలని కోరారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కోవిడ్ కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీపీ కోరారు. సర్వసభ్య సమావేశానికి అధికారుల గైర్హజరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు మూలగొండ్ల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, ఎంపీడీఓ పి.రవికుమార్, ఈఓపీఆర్డీ గుప్తా, డాక్టర్లు నార్ల చెన్నయ్య, ఆమూల్య, ఏవో పాపకుమారి, ఏఈ సోమయ్య పాల్గొన్నారు.

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాధ్యతలు చేపట్టిన పి.రవికుమార్‌ని శుక్రవారం సన్మానించారు.

కష్టపడిన ప్రతి ఒక్కరికీ పదవుల్లో ప్రాధాన్యం

మాజీ ఎమ్మెల్యే కాసు


కాసును సత్కరిస్తున్నపార్టీ నాయకులు

గురజాల: మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడి ఉన్న ప్రతి ఒక్కరికి పదవుల్లో ప్రాధాన్యం ఇస్తామని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన వీరంరెడ్డి అమరారెడ్డి, నరసరావుపేటలోని మాజీ ఎమ్మెల్యే కాసు నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాసు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టించి పనిచేసిన వారికి ఏమైనా ఇబ్బందులు వస్తే పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడ కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), వేముల చలమయ్య పాల్గొన్నారు.

సేవలో విద్యకే తొలి ప్రాధాన్యం

యడ్లపాడు: అనాథ బాలల విద్యాభ్యున్నతికి ఇన్నర్‌వీల్ క్లబ్ భారీ విరాళాన్ని అందించింది. యడ్లపాడు మండలం కొత్తపాలెం (పుట్టకోట)లో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక గురూజీ రవిశంకర్ ఆశ్రమ పాఠశాల(ఆర్ట్ ఆఫ్ లింగ్)కు రూ.10.20 చెక్కును శుక్రవారం అందజేశారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాల్లో పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు ఉచిత విద్య, సౌకర్యాలను అందించడంలో ఇన్నర్‌వీల్ తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇందులో భాగంగానే మద్ది లక్ష్మయ్య గ్రూప్స్ కంపెనీ డైరెక్టర్ మద్ది వెంకటేశ్వరరావు, లలితమ్మ దంపతుల ఆర్థిక సహకారంతో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో రూ.10.20 లక్షల విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ ప్రేమలత మాట్లాడుతూ కొండవీడు కొండల నడుమ పచ్చని ప్రకృతితో అనాథ ఆశ్రమ పాఠశాల నిర్వహించడం అభినందనీయమన్నారు.

• గురజాలలో వర్షం



గురజాల రూరల్: వర్షం కురిసింది. నగర పంచాయతినందు శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. సాయంత్రం వాతావరణం చల్లబడింది. సుమారుగా గంటకు పైగా వర్షం కురిసింది. డ్రెయినేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురికి కాలువల్లో నీరు రోడ్డుపైకి చేరింది. దీంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు.

బాలికలకు రక్షణ కల్పించాలి

సత్తెనపల్లి: లింగ వివక్ష విడనాడి, ఆపదలో ఉన్న బాలికలకు రక్షణ కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.ప్రమీల అన్నారు. ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్టు పరిధిలోని పట్టణంలోని రెండో వార్డు అంగన్‌వాడీ సెంటర్ (ఎస్టీ)లో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సూపర్‌వైజర్ ప్రమీల మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికలకు ఎలాంటి ఆపద వచ్చినా 100కు ఫోన్ చేయాలన్నారు. ఆడపిల్లలను స్వేచ్ఛగా జీవించనీయాలని ఆడపిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. రోజు అరగంట యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనంతలక్ష్మి, రాణి, కిశోర బాలికలు ఉన్నారు.

బాలికలు భవిష్యత్తును మెరుగు పరచుకోవాలి

అచ్చంపేట: బాలికలు వారి భవిష్యత్తును మెరుగు పరచుకోవడానికి, కుటుంబ పోషణలో తల్లిదండ్రులకు సాయపడడానికి సమాజంలో ఒక మంచి భాగస్వామ్యం కలిగి ఉండేందుకు రూపొందించిందే కిశోరి వికాసం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం తెలిపారు. కిశోరి వికాశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోనూరు, అచ్చంపేట గ్రామాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికల అభివృద్ధి, సాధికారత కోసం, కౌమార బాలికలకు విద్య, ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, ఆత్మరక్షణ, మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించడమే కిశోరి వికాశం ముఖ్య ఉద్దేశమన్నారు.

ఆడపిల్లల పట్ల చిన్నచూపు విడనాడాలి : సీడీపీఓ శ్రీలత

మాదల(ముప్పాళ్ళ): ఆడపిల్లల పట్ల చిన్నచూపు విడనాడాలని లింగ వివక్ష చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత చెప్పారు. మండలంలోని మాదల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జరిగిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రక్తహీనత, బాల్య వివాహాలతో అనర్థాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏసీడీపీవో సంతోషికుమారి, డీసీపీవో యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రశాంత్, అవుట్ రీచ్ వర్కర్ నానమ్మలు పాల్గొని వ్యక్తిగత పరిశుభ్రత, బాలల హక్కుల పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కిశోర బాలికలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

NOTICE

IN THE COURT OF THE X ADDL. DIST.JUDGE ::GURAJALA
1)I.A. No. 304/2022, 2)I.A. No. 305/2022, 3)I.A. No. 340/2023 4)I.A. No. 341/2023, 5)I.A. No. 342/2023, 6)I.A. No. 343/2023 7)I.A. No. 344/2023, 8)I.A. No. 345/2023 in AS No. 42/2019

Between:
Phanithi Babu Rajendra Prasad (Died) & Others. ...Petitioners/Appellants
And
Panithi Jorge Albert & Others ...Respondents

To,
R-3:Panithi Elishe Kumar,S/o.John Kanakaiah, R/o. Door No.10-132, Station Road, Piduguralla, Guntur Dt. [1)I.A.No.304/2022, U/s.22 R9 and Sec 151of C.P.C.to set aside abatement, 2)I.A.No.305/2022,U/s.22 R3 and Sec-151 of C.P.C to add LRs of Appellant, 3)I.A.No.340/2023 Sec-5 of limitation act to condone delay, 4)I.A.No.341/202, U/s.22 R9 and Sec-151of C.P.C.to set aside abatement,5)I.A.No.342/202,U/o.22 R4 and Sec-151 of C.P.C to add LRs of R-1,i.e.R-11 to R-17, 6)I.A.No. 343/2023,U/s.5 of limitation act to condone delay, 7)I.A.No. 344/2023 U/o.22 R9 Proposed Appellants to set aside abatement, 8)I.A.No.345/2023 U/o.22 R4 and Sec-151 of C.P.C to add R-18 & R-19].
R-13:Panithi@Nukabathini Ramya Rajitha,D/o.Late Chennaiah, R/o.Gandhi Nagar, Piduguralla, Palnadu Dist. 1)I.A.No.340/2023 Sec-5 of limitation act to condone delay, 2)I.A.No. 341/202, U/s.22 R9 and Sec-151of C.P.C. to set aside abatement, 3) I.A.No.343/2023, U/s.5 of limitation act to condone delay, 7) I.A.No.344/2023 U/o.22 R9 Proposed Appellants to set aside abatement, 4)I.A.No.345/2023 U/o.22 R4 and Sec-151 of C.P.C to add R-18 & R-19].
R-15:Panithi@Nukabathini Persi Rajitha, D/o. Late Chennaiah, R/o. Gandhi Nagar, Piduguralla, Palnadu Dist. [I.A.No.345/2023 U/o.22 R4 and Sec-151 of C.P.C to add R-18 & R-19].
R-19: Mary Chandhoss Bhagyam, D/o. Noah, R/o. Near Church, Lenin Nagar, Piduguralla, Palnadu Dist. [I.A.No.344/2023 U/o.22 R9 Proposed Appellants to set aside abatement, I.A.No. 345/2023 U/o.22 R4 and Sec-151 of C.P.C to add R-18 & R-19].
పై నెంబరు అప్పీలు దావాలోని పలు ఐ.ఏలలో రెస్పాండెంట్స్ అయిన మీకు నోటీసు నిమిత్తం పేపరుపబ్లికేషన్ ద్వారా తెలియజేయమని కోర్టువారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున పైన ఉదహరించిన రెస్పాండెంట్లు ది.20-06-2025న ఉ॥గం॥10-30ని॥లకు పైకోర్టువారి ఎదుటహాజరై తమకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీపరోక్షమున తీర్మానించబడును.

జక్కా చెన్నకేశవరావు
పిటీషనర్లు/అప్పిలెంట్ల తరపు అడ్వకేట్, గురజాల, పల్నాడుజిల్లా. సెల్: 9885134858



పల్నాడు కేంద్రంగా విద్యా ప్రగతి

- మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తున్న విద్యా సంస్థలు
- ప్రతిభను చాటుతున్న చిన్నారులు

గురజాల: చిన్నారులు విద్యలో ప్రతిభ చాటుతున్నారు. ఒకప్పుడు విద్యాసంస్థలు లేవు. విద్యపై అవగాహనా లేదు. ప్రోత్సాహం అంతంతమాత్రమే. ప్రధానంగా పల్నాడు ప్రాంతం వెనకబడి ఉండడమే. నిరాక్షరాస్యత వలన చదువులు సాగలేదు. ప్రస్తుతం మొత్తం మారిపోయింది. గత కొన్ని సంవత్సరాలుగా విద్యా ప్రగతి విరజిల్లుతోంది. గత నెలలో విడుదల చేసిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారు. గురజాలలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల, శివాని విద్యానికేతన్, పిడుగురాళ్ల పట్టణంలోని స్కాలర్స్ విద్యా సంస్థలు, వివేకానంద పబ్లిక్ స్కూల్, శ్రీ గౌతమి మోడల్ స్కూల్, మాచర్ల పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ మీడియం, చక్రధర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచారు. పల్నాడు ప్రాంతంలో ఎంతో మంది మట్టిలో మాణిక్యాలను వెలికితీసి వారి ఉన్నత భవిష్యత్‌కు కృషి చేస్తున్నారు.

అన్ని హంగులతో కూడిన పాఠశాలలు

విద్య పరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని హంగులతో కూడిన పాఠశాలలుగా రూపుదిద్దుకున్నాయి. పాఠశాలల్లో క్రీడా ప్రాంగణంతో పాటు మెరుగైన వసతులు కల్పిస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఒత్తిడి లేని విద్యను విద్యార్థులకు అందిస్తున్నారు. ఈ పాఠశాలల్లో ఐఐటీ, నీట్‌వంటి పరీక్షలకు ముందు నుంచే విద్యార్థులకు సబ్జెక్టులపై అవగాహన కల్పిస్తున్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ పాఠశాలలను విద్యార్థులకు అందుబాటులో ఉంచుతున్నారు.

నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలి


రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

మాచర్ల రూరల్: నిత్యావసరాల పంపిణీలో రేషన్ డీలర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్ హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. రేషన్ కార్డు దారులు ఎక్కడ ఉంటారో ఆ ప్రాంతంలోనే దుకాణాన్ని ఏర్పాటు చేయాలని, ఉదయం 8 నుంచి 12గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8గంటల వరకు సమయపాలన పాటించాలని సూచించారు. ప్రతి లబ్ధిదారుడికి సరుకులు సక్రమంగా అందేలా చూడాలని కోరారు. రేషన్ బియ్యం ఇవ్వకుండా నగదు చెల్లించేలా దుకాణదారుడు ప్రవర్తిస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. అలాగే నూతన రేషన్‌కార్డు దరఖాస్తులను సచివాలయంలో నమోదు చేయించుకోవాలని, పేర్ల మార్పులు ప్రక్రియనూ ప్రజలకు అవగాహన కల్పించటంలో దుకాణదారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఇల్ల పట్టాలు రాని వారు దరఖాస్తులను అందించాలని సూచించారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ బత్తుల వాణి, సివిల్ సప్లయిస్ డీటీ జి.రమణ, ఆర్ఐ ఇంటూరి అనిల్ కుమార్, వీఆర్‌ఓలు నాగేశ్వరరావు, అంజి, భాస్కర్, చంద్ర, ఖాజావలి, అనిత పాల్గొన్నారు.

ఘనంగా ఓంకార్ శత జయంతి


మిట్టగుడిపాడులో ఓంకార్ శతజయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎంసీపీఐ(యూ) నాయకులు

రెంటచింతల: మండలంలోని మిట్టగుడిపాడులో ఓంకార్ శత జయంతి వేడుకలను మాచర్ల డివిజన్ ఎంసీపీఐ(యూ) నాయకులు మాచవరపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఓంకార్ శత జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తూమాటి శివయ్య, పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి తూమాటి మాణికంతేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మాచవరపు నాగేశ్వరరావు, చంద్రకళ, అంజమ్మ, సుందరరావు, మాచర్ల రామయ్య పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

దాచేపల్లి: స్థలం వివాదంలో దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సౌందర్యరాజన్ శుక్రవారం తెలిపారు. వివరాలు.. దాచేపల్లికి చెందిన అంబటి మల్లిపై గురువారం కొంతమంది వ్యక్తులు స్థలం వివాదంపై ఘర్షణకు దిగి దాడి చేశారని, ఈ ఘటనలో మల్లికి గాయాలు కావటంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

8 నుంచి పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

రెంటచింతల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జూన్ 8వ తేదీ నుంచి పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ-2 వై.శివ నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్, జెడ్పీ, కస్తూరిబా, ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు 37 ఉండగా మొత్తం 3,322 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. 16,490 పాఠ్య పుస్తకాలు, 33 వేల నోట్‌బుక్స్, 2,236 బెల్టులు, 416 ఆక్స్‌ఫర్డ్ డిషనరీలు వచ్చినట్లు తెలిపారు. రెండు, మూడు రోజులలో బుక్స్, యూనిఫాం, షూష్ కూడా రానున్నట్లు వివరించారు. 2025-2026 విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే జూన్ 12 నాటికి ప్రతి పాఠశాల హెచ్‌ఎం కిట్లను తీసుకెళ్లి సకాలంలో విద్యార్థులకు అందించాలని కోరారు.